క్లుప్తంగా

కొలతల ప్రకారం పనులు చేయాలి



వర్కూరులో ఉపాధి కూలీల మస్టర్లను పరిశీలిస్తున్న ఎంపీడీఓ చంద్రశేఖర్

కోడుమూరు రూరల్: ఉపాధి హామీ పథకం కింద పనులు చేసే కూలీలంతా నిర్దేశిత కొలతల ప్రకారం పనులు చేస్తే రోజుకు రూ.272 వేతనం పడుతుందని ఎంపీడీఓ చంద్రశేఖర్ సూచించారు. మండలంలోని వర్కూరులో ఉపాధి హామీ పథకం కింద చెక్‌డ్యాంలో జరుగుతున్న పూడికతీత పనులను మంగళవారం ఎంపీడీఓ చంద్రశేఖర్ ఏపీఓ రమాదేవితో కలిసి పరిశీలించి కూలీల హాజరు, మస్టర్లను తనిఖీ చేశారు. ఎంపీడీఓ మాట్లాడుతూ.. వలసల నివారణలో భాగంగా మండలంలోని ప్రతి గ్రామంలో ఉపాధి పనులు కల్పిస్తున్నామని, కూలీలు సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఉదయాన్నే పనుల్లోకి వచ్చి నిర్దేశిత కొలతల ప్రకారం పనులు చేసుకోవాలని, కూలీలు తప్పనిసరిగా హాజరు నమోదు చేయాలని ఎంపీడీఓ సూచించారు.

బీమా తక్షణ సాయం అందజేత



కొరటమద్దిలో బాధిత కుటుంబానికి సాయం అందిస్తున్న సర్పంచ్ నాగేశ్వర్‌రెడ్డి

గడివేముల: మండల పరిధిలోని కొరటమద్ది గ్రామానికి చెందిన కొమ్ము జనార్దన్ అనారోగ్యంతో మృతి చెందడంతో ఆ కుటుంబానికి వైఎస్సార్ బీమా తక్షణ సాయం కింద రూ.10 వేలు అందించినట్లు సర్పంచ్ నాగేశ్వర్‌రెడ్డి తెలిపారు. మంగళవారం బాధితుడి ఇంటికి చేరుకుని మృతుని భార్య లక్ష్మీదేవికి బీమా సొమ్ము అందించారు. మిగతా మొత్తం త్వరలోనే నామినీ బ్యాంకు ఖాతాలో జమ అవుతుందన్నారు. పంచాయతీ కార్యదర్శి సలీం, వెల్ఫేర్ అసిస్టెంట్ జాకీర్‌ఉసేన్, సచివాలయ సిబ్బంది ఉన్నారు.

ఇంటి వద్దకే వైద్యసేవలు



గని గ్రామంలో మంచానికి పరిమితమైన వ్యక్తికి వైద్య పరీక్షలు చేస్తున్న డాక్టర్ మద్దిలేటి

గడివేముల: రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా అమలు చేస్తున్న ఫ్యామిలీ ఫిజీషియన్ కార్యక్రమాన్ని సద్వినియోగం చేసుకోవాలని తలముడిపి పీహెచ్‌సీ డాక్టర్ మద్దిలేటి సూచించారు. ఆయన మంగళవారం గని గ్రామ సచివాలయం వద్ద ప్రజలకు వైద్య పరీక్షలు చేశారు. గ్రామంలో వివిధ దీర్ఘకాలిక రోగాలతో బాధపడుతున్న వారికి వైద్య పరీక్షలు నిర్వహించి 84 మందికి ఉచితంగా మందులను పంపిణీ చేశారు. మంచానికే పరిమిత రోగులను పరిశీలించడంతో పాటు బాలింతలు, చిన్నారులకు వైద్య పరీక్షలు నిర్వహించి అవసరమైన వారికి మందులను అందించారు. ఎంపీహెచ్‌ఈఓ సుబ్బారెడ్డి, ఎంపీహెచ్‌ఎస్ మనోహర్, ఏఎన్ఎం, ఫార్మసిస్ట్, ఆశావర్కర్లు పాల్గొన్నారు.

లేగదూడలను సంరక్షించుకోవాలి



పాడి రైతులకు మందులను అందజేస్తున్న విజయ డెయిరీ చైర్మన్ ఎస్వీ జగన్‌మోహన్ రెడ్డి

పాణ్యం: పాడిరైతులు లేగదూడలపై ప్రత్యేక దృష్టి సారించాలని నంద్యాల విజయ డెయిరీ చైర్మన్ ఎస్వీ జగన్‌మోహన్‌రెడ్డి అన్నారు. మంగళవారం రసూల్లాపేట గ్రామంలో కృత్రిమ గర్భధారణ ద్వారా పుట్టిన లేగదూడల ప్రదర్శన నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్వీ జగన్‌మోహన్‌రెడ్డి మాట్లాడుతూ పాడి రైతులు లేగదూడలకు జున్ను పాలు తాగించడం, పుట్టిన 7, 15, 30వ రోజు నట్టల నివారణ మందులు తాగించాలన్నారు. కర్నూలు పశుఘనాభివృద్ధి సంఘం ఉప సంచాలకులు డాక్టర్ రాజశేఖర్, పాణ్యం ఏడీఏ కమలాకర్ మాట్లాడారు. మేలు జాతి దూడలకు క్యాల్షియం టానిక్‌లు, పశుపోషకులకు పాల క్యాన్‌లు అందించారు. డాక్టర్ చిన్న పుల్లయ్య, నవీన్, సులోచన, బాబాఫక్రుద్దీన్ తదితరులు పాల్గొన్నారు.

గ్రామాల్లో వైద్య సేవలు

పాణ్యం: రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన ఫ్యామిలీ ఫిజీషియన్ కార్యక్రమంలో భాగంగా ప్రజలకు ఇంటి వద్దకే వైద్య సేవలు కొనసాగుతున్నాయి. మంగళవారం మద్దూరు పీహెచ్‌సీ డాక్టర్ భగవాన్‌దాస్ ఆధ్వర్యంలో కందికాయపల్లె గ్రామంలోని ప్రాథమిక పాఠశాల వద్ద ఓపీ నిర్వహించారు. 13 మంది బీపీ, 11 మంది షుగర్ వ్యాధిగ్రస్తులకు చికిత్స అందించి మందులు పంపిణీ చేశారు. మధ్యాహ్నం మంచానికి పరిమితమైన రోగుల ఇళ్లకు వెళ్లి చికిత్స అందించారు. ఎంఎల్‌హెచ్‌పీ రత్నరాధిక, ఏఎన్ఎం శ్రీదేవి, 104 సిబ్బంది పాల్గొన్నారు.

ప్రభుత్వ బడులకు భద్రత

- నైట్ వాచ్‌మెన్‌ల ఏర్పాటు
- జెడ్పీ హైస్కూళ్ల ఆస్తుల పరిరక్షణకు ప్రభుత్వం చర్యలు



కోడుమూరు జిల్లా పరిషత్ హైస్కూల్

కోడుమూరు: నాలుగేళ్ల క్రితం పులకుర్తి హైస్కూల్లో ప్రభుత్వం ఏర్పాటు చేసిన 32 కంప్యూటర్లను దోపిడీ దొంగలు ఎత్తుకెళ్లారు. అప్పటి ఎంఈఓ కోడుమూరు పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేసినా దొంగల ఆచూకీ బయటపడకపోగా లక్షల విలువైన ప్రభుత్వ వస్తువులు అన్యాక్రాంతమైపోయాయి.

సి.బెళగల్ మండలం కొత్తకోట జిల్లా పరిషత్ హైస్కూలో రెండేళ్ల క్రితం దొంగలు చొరబడి విలువైన రికార్డులను ధ్వంసం చేసి తగలబెట్టి పోయారు.

మూడేళ్ల క్రితం కోడుమూరు జిల్లా పరిషత్ హైస్కూల్లో ఆకతాయిలు కిటికీలను ధ్వంసం చేసి విద్యార్థులకు సంబంధించిన రికార్డులకు నిప్పు పెట్టి పరారయ్యారు.

ఇలాంటి ఘటనలు జరగకూడదనే ఉద్దేశంతో రాష్ట్ర ప్రభుత్వం హైస్కూళ్లలో నైట్ వాచ్‌మెన్‌లను ఏర్పాటు చేసేందుకు పూనుకుంది. గత తెలుగుదేశం ప్రభుత్వ హయాంలో పూర్తిగా నిర్వీర్యమైపోయిన విద్యా వ్యవస్థను ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి అభివృద్ధి పథంలో నడిపిస్తున్నారు. పాడుబడిన పాఠశాలలను నాడు–నేడు పథకం కింద కార్పొరేట్ స్థాయిలో ఆధునీకరించడంతో పాటు సకల సౌకర్యాలను ప్రభుత్వం ఏర్పాటు చేసింది. హైస్కూళ్లలో విద్యార్థుల కోసం ఏర్పాటు చేసిన సౌకర్యాలు, కంప్యూటర్ పరికరాలు, ఇతర సామగ్రిని కాపాడేందుకు ప్రభుత్వం నైట్ వాచ్‌మెన్‌లను ఏర్పాటు చేసేందుకు చర్యలు తీసుకోవడంతో ఉపాధ్యాయులు, ప్రధానోపాధ్యాయులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు. జెడ్పీ హైస్కూళ్లలో ఏళ్ల తరబడి నైట్ వాచ్‌మెన్‌లు లేకపోవడంతో చాలాసార్లు చోరీలు జరిగాయి. విద్యార్థులకు సంబంధించిన కంప్యూటర్లు, టీవీలు ఎత్తుకెళ్లడం, ఆకతాయిలు చొరబడి రికార్డులను తగలబెట్టడం ఎన్నో సార్లు జరిగాయి. మందుబాబులు, జూదరులు హైస్కూల్ ప్రాంగణాలను అసాంఘిక కార్యక్రమాలకు నిలయంగా మార్చేస్తున్నారు. మద్యం మత్తులో ఆస్తులను, ఫర్నీచర్లను ధ్వంసం చేసిన సందర్భాలున్నాయి. అంతేగాక పాఠశాల ఆవరణలో పశువులు చొరబడి నీడనిచ్చే మొక్కలను, చెట్లను ధ్వంసం చేస్తున్నాయి. వీటన్నింటిని హెచ్‌ఎంలు, ఉపాధ్యాయులు ఏళ్ల తరబడి మౌనంగా భరించారు. సెలవు రోజుల్లో ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు హైస్కూళ్లకు వచ్చి గమనించే పరిస్థితి ఉండేది. పాఠశాలలకు రక్షణ కరువైన నేపథ్యంలో ప్రభుత్వం నైట్ వాచ్‌మెన్‌లను నియమించేందుకు చర్యలు చేపట్టింది.

నియోజకవర్గంలోని ప్రభుత్వ హైస్కూళ్లు	
కోడుమూరు	– 10
గూడూరు	– 6
సి.బెళగల్	– 10
కర్నూలు రూరల్	– 32

స్థానికులకే ప్రాధాన్యం

జిల్లా పరిషత్ హైస్కూళ్లకు నైట్ వాచ్‌మెన్‌లను నియమిస్తూ ప్రభుత్వం జీఓ జారీ చేయడంపై ప్రధానోపాధ్యాయులు సంతోషం వ్యక్తం చేస్తున్నారు. నెలకు రూ.6 వేల గౌరవ వేతనంతో నియమించే నైట్ వాచ్‌మెన్ పోస్టులకు సంబంధించి అదే హైస్కూల్‌లో పనిచేసే మహిళ భర్తకు ప్రాధాన్యత ఇవ్వాలని, 60 ఏళ్లలోపు వయసున్న ఎక్స్‌సర్వీస్‌మెన్, పేరెంట్స్ కమిటీ ఎంపిక చేసే వ్యక్తిని గానీ నియమించాలని ప్రభుత్వం ఆదేశాలిచ్చింది. ఈ షరతుల ప్రకారం ఎంఈఓ, హెచ్‌ఎంలు సమన్వయంతో నమ్మకంగా పనిచేసే వాచ్‌మెన్‌లను నియమించుకున్నారు.

హైస్కూళ్లకు రక్షణ

హైస్కూళ్లకు నైట్ వాచ్‌మెన్‌లను నియమించాలన్న ప్రభుత్వ నిర్ణయం ఎంతో అభినందనీయం. గతంలో చాలాసార్లు ఉన్నతాధికారుల దృష్టికి ఈ విషయాన్ని తీసుకెళ్లాం. ప్రభుత్వం నైట్ వాచ్‌మెన్‌ల నియామకంపై జీఓ జారీ చేయడంతో హైస్కూళ్ల ఆస్తులకు రక్షణ ఏర్పడింది. గూడూరు మండలంలోని అన్ని హైస్కూళ్లకు నైట్ వాచ్‌మెన్‌లను నియమించాం.

– సునీలమ్మ, ఎంఈఓ, గూడూరు

కాల్వల పునరుద్ధరణకు చర్యలు

పాణ్యం: ఎస్సార్బీసీ ఆయకట్టు కాల్వల పునరుద్ధరణకు చర్యలు తీసుకుంటున్నామని ఎమ్మెల్యే కాటసాని రాంభూపాల్‌రెడ్డి పేర్కొన్నారు. ఆయన మంగళవారం పాణ్యంలో జరిగిన పలు శుభకార్యక్రమాల్లో పాల్గొన్నారు. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ.. ఖరీఫ్‌ను దృష్టిలో ఉంచుకొని రైతులకు సాగునీటి సరఫరాలో ఇబ్బందులు తలెత్తకుండా చర్యలు చేపడుతున్నట్లు చెప్పారు. 1వ నంబర్ బ్లాక్ మొదలుకొని అన్ని బ్లాక్‌లు, ఫీడర్ ఛానెల్, మరమ్మతులకు గురయ్యాయని, వీటిపై ఇప్పటికే 'కాడ' విభాగం దృష్టికి తీసుకెళ్లామన్నారు. అధికారులు క్షేత్రస్థాయిలో పరిశీలించి మరమ్మతు పనులకు ప్రతిపాదనలు పంపారన్నారు. వీటికి నిధులు మంజూరు చేయించి పనులు పూర్తి చేస్తామన్నారు. ఆయకట్టు రైతుకు సాఫీగా నీరందేలా చర్యలు తీసుకుంటామన్నారు. వీటితో పాటు ఎస్సార్బీసీ ప్రధాన కాల్వపై దృష్టి సారించామన్నారు. ఖరీఫ్‌లో రైతులకు ముందుగానే సాగునీరు అందించేందుకు ప్రణాళికలు సిద్ధం చేస్తున్నామన్నారు. అలాగే జంబులా పరమేశ్వరి ఆలయంలో పూజలు చేశారు. జెడ్పీటీసీ సద్దల సరళమ్మ, సూర్యనారాయణరెడ్డి, దస్తగిరిరెడ్డి, బాబు, కరుణాకర్‌రెడ్డి, సర్పంచ్ సద్దల సుజిత్ రెడ్డి, బొమ్మిశెట్టి శేఖర్ తదితరులు ఉన్నారు.

జగనన్న పాలనలో పేదలకు అందలం



పసుపలలో లబ్ధిదారుడికి సంక్షేమ పథకాలను వివరిస్తున్న కోడుమూరు ఎమ్మెల్యే డాక్టర్ సుధాకర్

కర్నూలు (న్యూటౌన్): ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పాలనలో ప్రజలకు బంగారు భవిష్యత్తు ఉంటుందని ఎమ్మెల్యే డాక్టర్ జరదొడ్డి సుధాకర్ అన్నారు. మంగళవారం కర్నూలు మండలం పసుపల గ్రామంలో గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమానికి విచ్చేసిన ఎమ్మెల్యేకు స్థానిక వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలు, మహిళలు పూలమాలలు వేసి ఘనంగా స్వాగతం పలికారు. ఎమ్మెల్యే ఇంటింటికీ వెళ్లి ప్రజలను ఆప్యాయంగా పలకరిస్తూ ప్రభుత్వ సంక్షేమ పథకాల ద్వారా చేకూరిన లబ్ధిని వివరించారు. స్థానిక సమస్యలపై ఆరా తీసి పరిష్కారానికి సత్వరం చర్యలు చేపట్టాలని అధికారులను ఆదేశించారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ.. వైఎస్సార్‌సీపీ పాలనలో గ్రామంలో షేక్ మాసూంబీకి పింఛన్ కానుక ద్వారా రూ.82 వేలు, వైఎస్సార్ చేయూత ద్వారా ఏటా 18,750, ఇంటి స్థలం రూ.2 లక్షలు, ఇల్లు రూ.2.50 లక్షలు మొత్తం రూ.5.50 లక్షలు లబ్ధి చేకూరిందని వివరించారు. అలాగే నాగేశయ్యకు రూ.5.72 లక్షలు, చింతకుంట కిష్టమ్మకు రూ.6.20 లక్షలు సంక్షేమ పథకాల ద్వారా లబ్ధి చేకూరిందని వివరించారు. ఇచ్చిన హామీలన్నీ నెరవేర్చి ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి దేశ చరిత్రలోనే రికార్డు సృష్టించారన్నారు. కర్నూలు ఎంపీపీ వెంకటేశ్వరమ్మ, వైస్ ఎంపీపీ–2 నెహమ్యా, జెడ్పీటీసీ సభ్యులు ప్రసన్నకుమార్, గిరిజోన్, నాయకులు మహబూబ్‌బాషా, శేషిరెడ్డి, ఎంపీడీఓ భాస్కర్‌నాయుడు, ఈఓఆర్‌డీ నాగేశ్వర్‌రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

గరిష్ట వేతనం పొందేలా పనులు



సి.బెళగల్‌లో ఉపాధి పనులను తనిఖీ చేస్తున్న డ్వామా పీడీ అమర్‌నాథ్‌రెడ్డి

సి.బెళగల్: ఉపాధి హామీ పథకం కింద కూలీలకు రోజుకు గరిష్ట వేతనం రూ.272 పొందేలా పనులు చేయించాలని డ్వామా పీడీ అమర్‌నాథ్ రెడ్డి ఆదేశించారు. ఆయన మంగళవారం జిల్లా విజిలెన్స్ అధికారి (డీవీఓ) సిద్ధలింగమూర్తితో కలిసి సి.బెళగల్ మండలంలోని గ్రామాలలో పర్యటించి అక్కడ జరుగుతున్న పనులను ఆకస్మికంగా తనిఖీ చేశారు. పోలకల్ గ్రామంలో జరుగుతున్న పంట కాలువల పూడికతీత పనులను పరిశీలించి కూలీలతో మాట్లాడారు. నిర్దేశిత కొలతల మేర పనులు చేయాలని, ఎండల తీవ్రత అధికంగా ఉండడం వల్ల ఉదయం 6 గంటలకు పని ప్రాంతాలకు చేరుకుని 11 గంటల్లోపు పూర్తి చేసుకోవాలని సూచించారు. అలాగే కొండ ప్రాంతంలో జరుగుతున్న ఇంకుడు గుంతల పనులను పరిశీలించారు. కూలీల హాజరును పరిశీలించి తనిఖీ వివరాలను ఆన్‌లైన్‌లో నమోదు చేశారు. మస్టర్ సమర్థవంతంగా నిర్వహించేలా ఉపాధి హామీ సిబ్బంది, మేటీలకు సూచనలు చేశారు. పని ప్రాంతంలో కూలీలకు అందాల్సిన వసతులు, సౌకర్యాలను కల్పించాలని ఏపీఓ లక్ష్మన్న, టీఏలను ఆదేశించారు. అనంతరం స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో ఉపాధిహామీ అధికారులు, సిబ్బందితో సమావేశమయ్యారు. ఉపాధి కూలీల సంఖ్య పెంచాలని, దినసరి వేతనం పెరిగేలా చర్యలు తీసుకోవాలని, ఉద్యాన పంటల సాగుపై ఆసక్తి కలిగిన రైతులను గుర్తించాలని సిబ్బందిని ఆదేశించారు. ఈసీ పృథ్వీరాజ్, టీఏలు, సీనియర్ మేట్లు, మేట్లు ఉన్నారు.

పాడి పరిశ్రమకు ప్రోత్సాహం



పాడిరైతులతో మాట్లాడుతున్న డాక్టర్ రాజశేఖర్

గడివేముల: రాష్ట్ర ప్రభుత్వం పాడిపరిశ్రమ అభివృద్ధికి ప్రోత్సాహం అందిస్తోందని నంద్యాల పశుగణాభివృద్ధి సంస్థ ఉప సంచాలకులు డాక్టర్ రాజశేఖర్ పేర్కొన్నారు. మంగళవారం దుర్వేశి గ్రామంలో పశువైద్య శాఖ ఆధ్వర్యంలో లేగ దూడల ప్రదర్శన నిర్వహించారు. 42 లేగదూడలు పాల్గొన్నాయి. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. గత కొన్నేళ్లుగా మేలు జాతి లేగ దూడలు గ్రామీణ ప్రాంతాలలో అధికంగా ఉన్నాయన్నారు. వాటిని బయటికి తీసేందుకే ఇటువంటి ప్రదర్శన కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు చెప్పారు. లేగ దూడల రైతులకు బహుమతులు, అవసరమైన మందులను ఉచితంగా పంపిణీ చేశారు. పశువులలో ఈతకు ఈతకు ఎడం తగ్గించడం వల్ల పాడిలో ఈతలు పెరిగి అధిక దూడలు, పాడి కాలం పెరుగుతుందన్నారు. జిల్లా సహాయ సంచాలకులు డాక్టర్ కమలాకర్, డాక్టర్ మల్లన్న, సర్పంచ్ మండ్ల మమత, డాక్టర్ సులోచన, పెసరవాయి పశువైద్యాధికారి డాక్టర్ షేక్ బాబా ఫక్రుద్దీన్, రైతులు పాల్గొన్నారు.

బడి ఈడు పిల్లలను గుర్తించండి

కోడుమూరు రూరల్: మండలంలో బడి ఈడు పిల్లలను గుర్తించే సర్వేను పకడ్బందీగా నిర్వహించాలని కోడుమూరు ఎంఈఓ అనంతయ్య సూచించారు. మంగళవారం మండలంలోని సచివాలయ వెల్ఫేర్, ఎడ్యుకేషన్ అసిస్టెంట్లు, ఐసీడీఎస్ సూపర్‌వైజర్లు, స్కూల్ కాంప్లెక్స్ పాఠశాలల హెచ్‌ఎంలతో ఎంఈఓ అనంతయ్య స్థానిక బాలికల హైస్కూల్లో మంగళవారం సమావేశం నిర్వహించారు. ఎంఈఓ మాట్లాడుతూ ప్రతి గ్రామంలో వలంటీర్ల సహకారంతో ఇంటింటికీ వెళ్లి 5–15 ఏళ్లలోపు పిల్లలు బడి బయట ఎంత మంది ఉన్నారు, బడిలో ఎంత మంది ఉన్నారు, ఏయే పాఠశాలల్లో చదువుతున్నారు తదితర వివరాలతో కూడిన సర్వేను ఈనెల 12వ తేదీలోగా పూర్తి చేసి నివేదిక సమర్పించాలని సూచించారు.

'జగనన్నకు చెబుదాం' కార్యక్రమం ప్రారంభం



జగనన్నకు చెబుదాం కార్యక్రమానికి వీక్షిస్తున్న అధికారులు

కల్లూరు: రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి మంగళవారం సీఎం క్యాంపు కార్యాలయంలో 'జగనన్నకు చెబుదాం' కార్యక్రమాన్ని ప్రారంభించారు.కల్లూరు మండల పరిషత్ సమావేశ భవనంలో ఎంపీడీఓ జీవీ రమణమూర్తి, ఎంఈఓ శ్రీనివాసులు, ఉపాధి హామీ పథకం ఏపీఓ మద్దేశ్వరమ్మ, అధికారులు కార్యక్రమాన్ని లైవ్‌లో స్క్రీన్‌పై వీక్షించారు. ఈ సందర్భంగా అధికారులు మాట్లాడుతూ.. ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ పథకాలు అందుకోవడం, ప్రభుత్వ సేవలపై మండలంలో ఎవరైనా ఇబ్బందులున్నారు 1902 ఫోన్ చేయవచ్చునన్నారు. ఫోన్ చేసిన ఫిర్యాదుదారుని నమోదు చేసుకొని వైఎస్సార్ ఐడీ (యువర్ సర్వీస్ రిక్వెస్ట్ ఐడీ) కేటాయించి అతనికి కావాలసిన సమాచారాన్ని ఎప్పటికప్పుడు మొబైల్ ఫోన్‌కు ఎస్ఎంఎస్ రూపంలో పంపుతారని తెలిపారు. ప్రతి సమస్యకు పరిష్కారం దొరుకుతుందన్నారు. మండల పరిషత్ కార్యాలయ సిబ్బంది, ఉపాధి హామీ పథకం సిబ్బంది, వెల్ఫేర్ అసిస్టెంట్లు, ఇంజినీరింగ్ అసిస్టెంట్లు పాల్గొన్నారు.

ప్రజలకు సత్వర సేవలు

పాణ్యం: సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రారంభించిన 'జగనన్నకు చెబుదాం' కార్యక్రమంతో ప్రజా సమస్యలకు సత్వరమే పరిష్కారం లభిస్తుందని ఎంపీపీ ఉసేన్‌బీ, ఎంపీడీఓ దస్తగిరి అన్నారు. మంగళవారం కార్యక్రమం ప్రారంభోత్సవాన్ని మండలం నుంచి అధికారులు టీవీ ద్వారా వీక్షించారు. ఈ సందర్భంగా ఎంపీడీఓ మాట్లాడుతూ.. ప్రజలకు ఏ అవసరమొచ్చినా తక్షణమే 1902కు ఫోన్ చేసి సమస్యను చెప్పుకోవచ్చన్నారు. టోల్ ఫ్రీ నంబర్‌పై ఆయా గ్రామ సచివాలయాల ఆధ్వర్యంలో గ్రామాల్లో ప్రచారం చేయించాలన్నారు. తహసీల్దార్ మల్లికార్జునరెడ్డి, సీఐ వెంకటేశ్వరరావు, ఎస్ఐలు సుధాకర్‌రెడ్డి, వెంకటసుబ్బయ్య మండలస్థాయి అధికారులు పాల్గొన్నారు.

ఈదురుగాలుల బీభత్సం

- బ్రాహ్మణదొడ్డిలో ఉరుములు, మెరుపులతో ఉలిక్కిపడిన జనం
- ధ్వంసమైన గుడిసెలు, విరిగిన విద్యుత్ స్తంభాలు, చెట్లు
- సహాయక చర్యలు చేపట్టిన అధికార బృందం



ఈదురు గాలులకు ఎగిరిపోయిన ఇంటి పైకప్పు



మౌలాలి చావిడి వద్ద విరిగిపడిన చెట్టు కొమ్మలు



విరిగిపడిన విద్యుత్ స్తంభాలు



గుడిసె ధ్వంసం కావడంతో సామగ్రిని బయటికి తీసుకొస్తున్న మహిళ

సి.బెళగల్: మండలంలోని బ్రాహ్మణదొడ్డి గ్రామంలో మంగళవారం ఒక్కసారిగా వచ్చిన ఉరుములు, మెరుపులతో కూడిన ఈదురుగాలులు పెను విధ్వంసం సృష్టించాయి. గ్రామంలో మధ్యాహ్నం 3:45 గంటలకు మొదలైన పెనుగాలుల బీభత్సానికి పలు గుడిసెల పైకప్పు ఎగిరిపోయాయి. గాలులకు తోడు వర్షం కురవడంతోని ఇంట్లోని ధాన్యం, ఇతర సామగ్రి తడిసి ముద్దయ్యాయి. గ్రామ శివారులోని చెరువు కొట్టాల ప్రాంతంలో నివాసం ఉంటున్న నాగరాజు, మౌలాలి, తిమ్మలకు చెందిన గుడిసెలు ధ్వంసమయ్యాయి. గుడిసెలో ఉన్న నాగరాజు కుమారుడు శివపై పైకప్పు పడి తలకు రక్తగాయమైంది. అలాగే మౌలాలితో పాటు కుటుంబ సభ్యులు సైతం గాయపడ్డారు. గ్రామానికి చెందిన కుమ్మరి పెద్ద సుంకన్న పొలం వద్ద విద్యుత్ స్తంభం విరిగిపడడంతో దానికి ఏర్పాటు చేసిన ట్రాన్స్‌ఫార్మర్ కింద పడిపోయింది. అలాగే గ్రామ చివరనున్న పొలాల్లో విద్యుత్ స్తంభాలు నేలకొరిగాయి. పెను గాలులకు పలు చెట్లు విరిగిపడ్డాయి.

వెంటనే స్పందించిన సర్పంచ్, అధికార బృందం

గ్రామంలో పెనుగాలులు బీభత్సం సృష్టించడంతో నష్టపోయిన బాధితులను సర్పంచ్ దస్తగిరి పరామర్శించారు. నియోజకవర్గ, మండల, నాయకులకు, అధికారులకు సమాచారం అందించారు. వీఆర్వో జాకీర్, జూనియర్ లైన్‌మెన్ (జేఎల్) చంద్ర అక్కడికి చేరుకుని బాధితులతో మాట్లాడి నష్టం వివరాలు నమోదు చేసుకున్నారు. విద్యుత్ మెయిన్ లైన్ సరఫరా నిలిపివేయడంతో పాటు తెగిపడిన తీగలను తొలగించారు. స్థానిక ఎస్ఐ పీరయ్య, ఎంపీడీఓ రాముడు, తహసీల్దార్ శివశంకర్‌నాయక్‌లు తమ సిబ్బందితో వివరాలను తెలుసుకుని జిల్లా అధికారులకు నివేదించారు. తిండి గింజలతో పాటు, పండించుకున్న ధాన్యం సైతం తడిసిపోయిందని, తమను ప్రభుత్వం ఆదుకోవాలని బాధితులు కోరుతున్నారు.

నాడు–నేడు పనులు పూర్తి చేయండి



సమావేశంలో మాట్లాడుతున్న ఎంఈఓ శ్రీనివాసులు

కల్లూరు: పాఠశాలలు తెరిచే నాటికి (జూన్ 12) మనబడి నాడు–నేడు రెండవ దశలో చేపట్టిన పనులను పూర్తి చేయాలని ఎంఈఓ శ్రీనివాసులు ప్రధానోపాధ్యాయులకు సూచించారు. ఆయన మంగళవారం స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో నాడు–నేడు పనులపై సమీక్ష నిర్వహించారు. ఎంఈఓ మాట్లాడుతూ పాఠశాలల్లో జరుగుతున్న పనుల ఖర్చు, బిల్లుల వివరాలన్నీ కాంపోనెంట్ ప్రకారం ఎస్‌టీఎంఎస్ యాప్‌లో నమోదు చేయలన్నారు. ఇంజినీరింగ్ అసిస్టెంట్లు కాంపొనెంట్ వారీగా ఫొటోలను క్యాప్చర్ చేయాలని ఆదేశించారు. పాఠశాల ప్రధానోపాధాయులు ఐఎఫ్‌ఏ ట్యాబ్స్ విద్యార్థులకు పంపిణీచేస్తూ విద్యార్థుల హాజరును యాప్‌లో నమోదు చేయలన్నారు. ఎంపీడీఓ జివి రమణమూర్తి, ఏపీఎం శ్రీనివాసగౌడ్, ఈఓఆర్డీ రవికిషోర్, మున్సిపల్ ఏఈ కృష్ణలత, ప్రధానోపాధ్యాయులు, గ్రామ సచివాలయాల ఇంజనీరింగ్ అసిస్టెంట్లు పాల్గొన్నారు. అనంతరం ఎంపీడీఓ అధ్యక్షతన ఓసీఎస్ సర్వేపై సచివాలయ వెల్ఫేర్ అసిస్టెంట్లు, మున్సిపాలిటీ పరిధిలోని ఎడ్యుకేషన్ అండ్ డేటా ప్రాసెసింగ్ సిబ్బందికి శిక్షణ కార్యక్రమం నిర్వహించారు.

ఉత్పత్తులకు అనుగుణంగా మార్కెటింగ్ సౌకర్యం



ఉల్లి సోలార్ డ్రయ్యర్‌ను పరిశీలిస్తున్న మార్కెటింగ్ జేడీ రామాంజనేయులు

కల్లూరు: గ్రామంలో ఉత్పత్తులకు అనుగుణంగా మార్కెటింగ్ సౌకర్యం కల్పిస్తామని మార్కెటింగ్ జాయింట్ డైరెక్టర్ రామాంజనేయులు అన్నారు. మంగళవారం కల్లూరు మండలం తడకనపల్లె గ్రామంలో మార్కెటింగ్ జాయింట్ డైరెక్టర్ రామాంజనేయులు ఉల్లి సోలార్ డ్రయర్, పాలకొవ్వ ఉత్పత్తులను పరిశీలించి ప్రజలు ఏవిధంగా లబ్ధిపొందుతున్నారో అధ్యయనం చేశారు. ఆయన స్వయంగా వెళ్లి ఉల్లి సోలార్ డ్రయ్యర్, పాలకొవ్వ తయారీ మిషన్లు, తయారీ విధానం పరిశీలించి నిర్వాహకులతో మాట్లాడారు. గ్రామంలో ఉల్లి డ్రయ్యర్లు 25 యూనిట్లు ఉన్నాయని వాటితో నెలకు రూ. 10 వేల నుంచి 18 వేలు ఆదాయం పొందుతున్నట్లు పొదుపు సంఘం మహిళ జుబేదాబీ, సభ్యులు వివరించారు.

నేలవాలిన కొర్ర పంట



కోడుమూరులో ఈదురుగాలులకు నేలవాలిన కొర్ర పంట

కోడుమూరు రూరల్: గత ఐదు రోజుల నుంచి మండలంలో కురుస్తున్న వర్షాలు, ఈదురుగాలులకు చేతి కందే దశలో ఉన్న కొర్ర పంట దెబ్బతింది. గాజులదిన్నె ప్రాజెక్టు కుడి, ఎడమ కాల్వల కింద ఆరుతడి పంటగా మండలంలో 480 ఎకరాల్లో రైతులు కొర్ర సాగు చేశారు. ప్రస్తుతం పంట కోత దశకు చేరుకుంది. ఈ తరుణంలో భారీ ఈదురు గాలులు, వర్షాలు పడుతుండడంతో చేతికొచ్చిన కొర్రపంట నేల వాలుతోంది. దీంతో పంటను కోసేందుకు రైతులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. అలాగే వదిలేస్తే వర్షాలకు కొర్ర కంకులకు మొలకలు వస్తాయేమోనని ఆందోళన చెందుతున్నారు.

సంక్షిప్తం

విద్యార్థుల ప్రతిభ

ఓర్వకల్లు: మండలంలోని పాలకొలను గ్రామానికి చెందిన విద్యార్థులు ఇటీవల జరిగిన అంబేడ్కర్ గురుకుల విద్యాలయ ప్రవేశ పరీక్షలో ప్రతిభ కనబరచడంతో ఎంఈఓ సునంద ప్రత్యేకంగా అభినందించారు. మంగళవారం స్థానిక ఎంఈఆర్‌సీ కార్యాలయంలో విద్యార్థులు సాధించిన మార్కులను వెల్లడించారు. గ్రామంలోని ఎంపీపీ పాఠశాలకు చెందిన మాధురి, అన్నన్య 47/50 మార్కులు సాధించగా, నాని 44, హారిక 40 మార్కులతో సత్తా చాటారన్నారు. ఈ సందర్భంగాపాఠశాల హెచ్‌ఎం నిరంజన్‌గౌడు, ఉపాధ్యాయురాలు నిర్మలను దుశ్శాలువాలతో సన్మానించారు.

పర్యాటక కేంద్రంగా తీర్చిదిద్దాలి

ఓర్వకల్లు: ఓర్వకల్లు సమీపంలోని రాక్ గార్డెన్‌ను పర్యాటక కేంద్రంగా తీర్చిదిద్దాలని రాయలసీమ విద్యార్థి ఫెడరేషన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి రవీంద్రనాథ్ డిమాండ్ చేశారు. మంగళవారం ఆయన స్థానిక రాక్ గార్డెన్‌ను సందర్శించి, పర్యాటకులకు అవసరమైన వసతులు, గదులు, ఇతర మౌలిక సదుపాయాలను కల్పించాలని కోరారు. విడిది గదుల అద్దె తగ్గించాలని, మంచి నీరు అందుబాటులో ఉంచాలన్నారు. జిల్లా అధికారులు, ప్రజాప్రతినిధులు చొరవ తీసుకొని అభివృద్ధి చేయాలని కోరారు.

నిషేధిత ప్లాస్టిక్ విక్రయిస్తే చర్యలు

గూడూరు: పట్టణంలో బుధవారం నుంచి నిషేధిత ప్లాస్టిక్ కవర్లు, ఇతర సామగ్రి విక్రయిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని నగర పంచాయతీ కమిషనర్ ప్రసాద్‌గౌడ్ హెచ్చరించారు. మంగళవారం నగర పంచాయతీ కార్యాలంలో స్థానిక వ్యాపారస్తులతో కమిషనర్ సమావేశం నిర్వహించారు. ప్లాస్టిక్ రహిత పట్టణంగా గూడూరును తీర్చిదిద్దేందుకు ప్రతి ఒక్కరూ సహకరించాలన్నారు. హోటల్స్, దుకాణదారులు, ప్లాస్టిక్ వస్తువులను విక్రయిస్తే దాడులు జరిపి జరిమానా విధిస్తామన్నారు. కార్యాలయ మేనేజర్ రవికుమార్, సిబ్బంది ఉన్నారు.

వర్గీకరణే లక్ష్యంగా పని చేయాలి

పాణ్యం: ఎస్సీ వర్గీకరణే లక్ష్యంగా పని చేయాలని ఎంఆర్‌పీఎస్ రాష్ట్ర నాయకులు గద్దల సామేల్ పిలుపునిచ్చారు. ఆయన మంగళవారం 'గో టూ 50 డేస్ విలేజ్' కార్యక్రమంలో భాగంగా మద్దూరు, అహల్యాపురం గ్రామాల్లో గ్రామాల్లో పర్యటించారు. ఆయన మాట్లాడుతూ.. మాదిగలు అన్ని రంగాల్లో వెనకబడ్డారని, తక్షణమే ప్రభుత్వాలు వర్గీకరణ చేపట్టాలన్నారు. స్థానిక నాయకులు పాల్గొన్నారు.

సుంకేసులకు 350 క్యూసెక్కుల ఇన్‌ఫ్లో

గూడూరు: సుంకేసుల రిజర్వాయర్‌కు 350 క్యూసెక్కుల నీటి ఇన్‌ఫ్లో ఉంది. కర్నూలు నగర ప్రజల తాగునీటి అవసరాల నిమిత్తం కేసీ కాల్వకు 331 క్యూసెక్కుల నీటిని విడుదల చేస్తున్నారు. డ్యాంలో ప్రస్తుతం 1.152 టీఎంసీల నీరు నిల్వ ఉందని అధికారులు తెలిపారు.

బడి ఈడు పిల్లల సమాచారం సేకరించండి

గూడూరు: 5 –19 ఏళ్ల వయసులోపు పిల్లల వివరాలను వలంటీర్లు ఇంటింటి సర్వే చేయాలని తహసీల్దార్ రామాంజనేయులు అన్నారు. మంగళవారం మండల పరిషత్ కార్యాలయంలో సచివాలయ వెల్ఫేర్ ఎడ్యుకేషన్ అసిస్టెంట్లతో సమావేశం నిర్వహించారు. ఈ నెల 14లోపు వలంటీర్లు డోర్ టు డోర్ సర్వే నిర్వహించి బడి ఈడు పిల్లల సమాచారం సేకరించాలన్నారు. ఎంపీడీఓ మాదవీలత, ఐసీడీఎస్ సూపర్‌వైజర్‌లు, ఏఎన్ఎంలు పాల్గొన్నారు.